## 16. వాసిరెడ్డి సీతాదేవి

వాసిరెడ్డి సీతాదేవి 1933 డిసెంబర్ 15వ తేదీన జన్మించారు. ఈమె తల్లిదండ్రులు వాసిరెడ్డి రంగనాయకమ్మ,రాఘవయ్య దంపతులు. ఈమె చదివింది ఐదో తరగతి వరకే అయినా ప్రైవేట్ గా హిందీ ప్రచారక్, ప్రవీణ, సాహిత్యరత్నలలో ఉత్తీర్ణులయ్యారు. నాగపూర్ విశ్వవిద్యాలయం నుండి బి. ఏ మరియు ఎమ్.ఎ పూర్తి చేశారు.

ఈమె రచించిన మొదటి నవల 'జీవితం' తొలి కథ 'సాంబయ్య పెళ్లి'. ఈమె సుమారు 39 పైగా నవలలు, వందకు పైగా కథలు రచించారు .ఈమె రచించిన మట్టి మనిషి నవల 14 భాషల్లోకి అనువదించబడింది. 1982 సంవత్సరంలో నక్సలిజం గురించి వ్రాసిన 'మరీచిక' అనే నవలను రాష్ట్ర ప్రభుత్వం నిషేధించింది. ఈమె నవలలో కొన్ని, తెలుగు సినిమాలుగా, మరికొన్ని దూరదర్శన్ సీరియల్స్ గా నిర్మించబడ్డాయి. ఈమె జవహర్ బాలభవన్ డైరెక్టర్ గా పని చేశారు. 1985- 91 మధ్య ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యురాలిగా కూడా సేవలందించారు.

వీరికి ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీ పురస్కారం ఐదుసార్లు, ఆత్మగౌరవ పురస్కారం, శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం గౌరవ డి.లిట్(1989), శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం గౌరవ డి.లిట్ (1989), తెలుగు విశ్వవిద్యాలయం జీవిత కాల సాఫల్య పురస్కారం(1996) మొదలైన అవార్డులు లభించాయి . ఈమెకు 'ఆంధ్ర పెర్ల్ బక్' అనే బిరుదు ఉంది.

నేను మార్క్సిస్టును, రచయితకు మార్క్సిస్టు దృక్పథం లేకపోతే ఆ రచన అసంపూర్ణం, అపరిమితమవుతుందని చెప్పారు. చిన్నప్పటినుండి తన చుట్టూ, తన ఊర్లో స్త్రీల పట్ల కొనసాగే వివక్షను,అణచివేతను, కుటుంబ హింస ప్రత్యక్షంగా చూసిన సీతాదేవి ఆ దృక్పథంతోనే రచనలు చేశారు.

స్త్రీలు పుట్టిన దగ్గర్నుంచి ఎలాంటి ఇబ్బందులను ఎదుర్కొంటున్నారో, చదువు ఉన్నప్పటికీ అవమానాలు, తిరస్కారాలు ఎదుర్కొంటున్న విషయాన్ని వీరి రచనల్లో

వివరించారు . అర్చన, వసుంధర ,బొమ్మరిల్లు మొదలైనవి దీనికి ఉదాహరణగా చెప్పవచ్చు.

'రాబందులు-రామచిలుకలు' పంచాయతీరాజ్ వ్యవస్థ లోని అరాచకత్వాన్ని అవినీతి రాజకీయాలను తేటతెల్లం చేస్తుంది. ‘మరీచిక’ ఈ కాలపు ఉత్తమ నవలల్లో ఒకటి. ‘వెన్నెల మండుతుంది’ నవల నిరుద్యోగ సమస్య తీవ్రతను చిత్రీకరించింది. ‘మరో దెయ్యం కథ' అనే నవల మూఢనమ్మకాల వైపు నడిపించకూడదనే సందేశం ఇస్తుంది.

అభ్యుదయ దృక్పథం, సామాజిక చైతన్యం, సామ్యవాద విశ్వాసం, సాంఘిక ప్రయోజనం, ఇతివృత్త వైవిధ్యం గల రచనలు, కథన చాతుర్యం, పాత్రోన్మీలనం, శైలీ విన్యాసం గల రచనలెన్నో వాసిరెడ్డి సీతాదేవి కాలం నుండి వెలువడ్డాయి. ఈమె సుమారు 39 నవలను, అనేక కథలు రాసిన సీతాదేవి ఏప్రిల్ 13 2007 లో మరణించారు .అయినా వారి రచనలు చిరస్మరణీయం.